క్లుప్తంగా

ప్రజా జీవన రైతు పార్టీ గ్రేటర్ అధ్యక్షుడిగా అనిల్ కుమార్

కాచిగూడ: తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా మాదిరెడ్డి అనిల్ కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీరామ్ రవికుమార్‌లు ఎన్నికయ్యారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణలో యువత, రైతులు, మహిళల సంక్షేమానికి తమ పార్టీ పెద్దపీట వేస్తుందని వ్యవస్థాపక అధ్యక్షుడు శోభన్‌బాబు అన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని దీనిలో భాగంగానే త్వరలోనే అన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించి పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలన సాగుతోందని ఇప్పటి దాకా నిరుద్యోగ భృతి అమలు చేయలేదన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: సీఎం రిలీఫ్ ఫండ్ పథకానికి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ భరోసా కలిపిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద నల్లకుంటకు చెందిన రాజమ్మకు మంజూరైన రూ.60 వేల చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఎంతో ఉపశమనం కలిగిస్తుందన్నారు. లబ్ధిదారులు, స్థానిక బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో 12 రకాల సరుకులు ఇవ్వాలి

ముషీరాబాద్: రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యవసర సరుకుల పంపిణీ చేయాలని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ అన్నారు. పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టామన్నారు. ఈ మేరకు శుక్రవారం మార్క్స్ భవన్‌లో సంఘం నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ షాపుల్లో బియ్యం మాత్రమే ఇస్తున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 10 కేజీలు సన్న బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంచినూనె, కంది పప్పు, చింతపండు, పల్లీలు, ఉప్పు, కారం, పసుపు, గోధుమలు, పంచదార, టీ పొడీ లాంటి సరుకులను పంపిణీ చేయాలన్నారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని సబ్సిడీ 95 శాతం కోత విధించారన్నారు. ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ వరకు గ్రామాలు, బస్తీల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామన్నారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు స్వరూప, రాష్ట్ర నాయకులు వరలక్ష్మి, లక్ష్మీబాయి, నాయకులు రవికుమార్, పుష్ప, ఆంజనేయులు, అశోక్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జియాగూడ ప్రాంతానికి చెందిన బోయ అశోక్ భార్య బోయ లక్ష్మి (37) బుద్వేల్ రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా.. యశ్వంత్‌పూర్ రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మే 30న ఢిల్లీలో ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రజా సమస్యలు, దళితులపై దాడులు తదితరాలను నిరసిస్తూ మే 30న ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తామని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ప్రథమ మహాసభ జరిగింది. కార్యక్రమానికి డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు యేసురత్నం అధ్యక్షత వహించగా సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆల్ ఇండియా దళిత్ రైట్స్ ఫోరం జాతీయ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రాంమూర్తి, బాల మల్లేష్ తదితరులు ప్రసంగించారు. మే 30న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు, రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు నిరంకుశానికి నిదర్శనం

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పై అనర్హత వేటు కేంద్ర ప్రభుత్వ నిరంకుశానికి నిదర్శనమని పలువురు ఓయూ ప్రొఫెసర్లు పేర్కొన్నారు. శనివారం ఓయూ గెస్ట్‌హౌస్‌లో రీసెర్చ్ స్కాలర్ ఆధ్వర్యంలో రాహుల్ బహిష్కరణ పై బిగ్ డిస్కషన్ జరిగింది. కార్యక్రమానికి పీడీఎస్‌యూ విద్యార్థి నాగేశ్వర్‌రావు అధ్యక్షత వహించగా ఓయూ ప్రొఫెసర్లు గాలి వినోద్‌కుమార్, మహ్మద్ అన్సారీ, ప్రొ.చంద్రునాయక్, కాంగ్రెస్ నేత మానవతరాయ్, ఓయూ జేఏసీ నేత శరత్‌నాయక్, వామపక్ష విద్యార్థి నాయకులు పాల్గొని ప్రసంగించారు.

ముట్టుకుంటే షాకే !

- రక్షణలేని ఫ్యూజ్ బాక్సులు
- కంచెలేని ట్రాన్స్ ఫార్మర్లు
- విద్యుత్ తీగలతో ముప్పు
- అధ్వానంగా ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ



విక్రమ్‌నగర్ పార్కు వద్ద..



నారాయణగూడ మెట్రో స్టేషన్ వద్ద..

కాచిగూడ: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ రోజురోజుకు అధ్వాన్నంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణగా వేసిన కంచెలు ధ్వంసం కాగా.. మరికొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ కేబుళ్లు అడ్డదిడ్డంగా పడి ఉన్నాయి. – ఏళ్లు గడుస్తున్నా వీటి నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – మరికొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో ట్రాన్స్‌ఫార్మర్‌ను కనబడకుండా చేస్తున్నాయి. కాచిగూడ, గోల్నాక డివిజన్‌లలో నిర్వహణ లోపంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

- దశాబ్దాల క్రితం ఏర్పాటైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ అప్పట్లో సిమెంట్ ఇటుకలతో వేసిన కంచెలు కొద్ది రోజులకే ధ్వంసమయ్యాయన్నారు.
- మరికొన్నింటికీ ఇనుప కంచె వేయగా.. ప్రధాన రహదారుల పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద కూడా చెత్తా చెదారం, ఇతర వ్యర్థాలు యథేచ్ఛగా డంప్ అవుతున్నాయి.

మోగుతున్న ప్రమాద ఘంటికలు..

- వేసవితో పాటు వర్షాకాలంలో సైతం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న ఆయిల్ వేసవికాలంలో వేడెక్కి పేలిపోతోన్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.
- వర్షాకాలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఎర్తింగ్ వల్ల విద్యుదాఘాతంలో మనుషులతో పాటు మూగ జీవాలు ప్రమాదాల బారిన పడిన సందర్భాలున్నాయన్నారు.
- ముఖ్యంగా వర్షాలతో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద గుట్టలుగా ఉన్న చెత్తను తొలగించి వాటికి కంచెలు ఏర్పాటు చేయాని ప్రజలు కోరుతున్నారు.

పరిశీలించిన కార్పొరేటర్..

- చెప్పల్‌బజార్‌లో పాత స్తంభం ఒక వైపునకు వంగి ప్రమాదకరంగా మారింది. ఈ సమస్యను స్థానికులు కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు. శుక్రవారం ఆయన ప్రాంతాన్ని సందర్శించి సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పాత స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. బీజేపీ నేతలు కన్నెరమేష్‌యాదవ్, బీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్, దినేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణానగర్ బస్తీలో మూతలేని ఫ్యూజ్‌బాక్స్



పర్వరీష్ బాగ్ పార్క్ వద్ద..



చెప్పల్‌బజార్‌లోని పాత స్తంభాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాపు భవన నిర్మాణానికి శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న బీజేపీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ తదితరులు

కవాడిగూడ: కాపులు నిరంతర ప్రజా సేవలకులని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అఖిల భారత తెలగ బలిజ కాపు సంఘం ఆవరణలో కాపు భవన్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపులు మరింత ఐక్యతగా ఉంటే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. ఐకమత్యమే బలమని గుర్తుంచుకోవాలన్నారు. నూతనంగా నిర్మించబోయే కాపు భవన్ ప్రజలందరికో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం విశ్రాంత ఐఏఎస్ మద్దుశెట్టి గోపాలకృష్ణ, తలారి గోవిందరాజులు సమక్షంలో కాపు భవన నిర్మాణాకిఇ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలతో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ మాజీ కమీషనర్ విజయ్‌బాబు, బీఆర్ఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు తోట చంద్రశేఖర్, అఖిల భారత తెగ బలిజ కాపు సంఘం అధ్యక్షులు ఎర్రబోతు ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షులు అరవ రామకృష్ణ, భవన నిర్మాణ కన్వీనర్ ఎ.వి.రత్నాకర్, నాయకులు శ్రీహరితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడ పిల్లలకు కరాటే శిక్షణ అవసరం



ఉచిత కరాటే శిబిరాన్ని ప్రారంభించిన దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమాజంలో రోజురోజుకు ఆడపిల్లలపై అత్యాచారాలు, హింస పెరుగుతున్న కారణంగా వారికి రక్షణగా కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా కార్యాలయంలో వీరనారి ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు ఎన్నో చట్టాలు, షీటీమ్‌లను ఏర్పాటు చేసిన హింస పెరుగుతూనే ఉందన్నారు. పెట్టుబడిదారి సమాజం ఆడపిల్లలను అంగడి సరుకుగా చూపించడం వల్లనే ఆడపిల్లలపై హింస పెరుగుతుందన్నారు. ఆడపిల్లల ఆత్మ రక్షణకు కరాటే లాంటి శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వీరనారి ఐలమ్మ ట్రస్ట్ చైర్మన్ బుగ్గవీటి సరళ, ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అరుణజ్యోతి, మల్లులక్ష్మీ, ఉపాధ్యాయులు జ్యోతి, ట్రస్ట్ కార్యదర్శి హైమావతి, కె.ఎన్.ఆశలత, ఇందిరా, శశికళ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత

ముషీరాబాద్: ఆధ్మాత్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతత కలిగించేందుకు దోహదపడతాయని ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ సీఐ జహంగీర్‌యాదవ్ అన్నారు. వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ముషీరాబాద్‌లోని చారిత్రక మహంకాళి ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భక్తి, సామాజిక సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలని సూచించారు. ఆలయ ఈఓ సత్యనారాయణ, అర్చకులు చంద్రమౌళి, మాజీ చైర్మన్ ఎయిర్‌టెల్‌రాజు, సరోజ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న సీఐ జహంగీర్‌యాదవ్

నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి

ముషీరాబాద్: రబీ సీజన్‌లో అన్ని రకాల పంటలను తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయల చంద్రశేఖర్, కె.రంగారెడ్డిలు అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని మార్క్స్ భవన్‌లో శుక్రవారం నిర్వహించగా.. వారు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారన్నారు. వారు ప్రజలు, రైతులకు చేసిందేమి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామన్నారని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి 8 ఏళ్లు గడిచినా రైతులకు ఎలాంటి లాభం చేకూరలేదన్నారు. పండిన పంటకు ఎంఎస్‌పీ గ్యారెంటీ చట్టం ఊసేలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపరిహారం కౌలు రైతులకు నేరుగా ముట్టే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తదితరులున్నారు.

రూ. 38.50 కోట్ల ఆస్తిపన్ను రాబడి

ముషీరాబాద్: జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో 2023 ఆర్థిక సంవత్సరానికి మార్చి 31న రాత్రి 8 గంటల వరకు రూ.38.50 కోట్ల ఆస్తి పన్ను రాబడి వచ్చిందని డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య ప్రకటించారు. ఆస్తిపన్ను వసూలు చివరి రోజు శుక్రవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి ఆస్తిపన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా రాంనగర్‌లో నివాసం ఉంటున్న హరియానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. 2022–23 ఆర్థిక సంవత్సరానికి ముషీరాబాద్ సర్కిల్ నుంచి రూ.42 కోట్ల ఆస్తిపన్ను రాబడిని వసూలు చేయడం టార్గెట్‌గా ఉందని ఇప్పటి వరకు రూ.38.50 కోట్ల రాబడి వచ్చిందని తెలిపారు. మరింత ఆస్తిపన్ను వసూలు చేసే అవకాశం ఉందని తమకు కమిషనర్ ఇచ్చిన టార్గెట్‌లో 90 శాతం ఆస్తిపన్ను వసూలు చేశామన్నారు.

వృద్ధాప్యాన్ని అధిగమించేందుకు కళలు దోహదం



ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: వృద్ధాప్యాన్ని అధిగమించేందుకు కళలు దోహదపడతాయని హైదరాబాద్ కేంద్ర ఆకాశవాణి సంచాలకులు ఉదయ్‌శంకర్ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో జ్యోత్స్నకళాపీఠం, సంస్కార భారతి సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా వివిధ సాహితీ ప్రక్రియలలోని ప్రముఖులకు ఉగాది సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పెద్దవారు తమ సహచరులతో కలిసి ఏదో కళ లేదా సాహితీ ప్రక్రియను తరచూ కలిసి ఆస్వాధించడం, అభ్యసించడం అలవర్చుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్, కన్ను, మనోనేత్రం వీటిని ప్రతి ఒక్కరూ నియంత్రించుకుంటే వృద్ధాప్యం రాకుండా చురుకుగా ఉండొచ్చన్నారు. సాహితీవేత్త ఆచార్య గౌరీశంకర్, జ్యోష్నరాణి, సంస్కారభారతి ప్రధాన కార్యదర్శి శివాజీ, డాక్టర్ శరత్, ఏ.వరలక్ష్మి, స్వాతి, శాంతకుమారి, డాక్టర్ జయరాములు, పి.భారతి, భుజంగరెడ్డి, రవిశి రమేష్, డాక్టర్ బట్టేశ్వరశర్మ, రమణాజ్యోష్న, శోభన్‌బాబు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ లేబర్ కోర్టు అధ్యక్షుడిగా కె. రఘురాంరెడ్డి

చిక్కడపల్లి: బార్ అసోసియేషన్ లేబర్ కోర్టు నూతన అధ్యక్షుడిగా కె.రఘురాంరెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ఎ.తిరుపతిరెడ్డిపై రఘురాంరెడ్డి ఘన విజయం సాధించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా డి.విలాస్, జీవీఎస్ గణేష్, వంచ తిరుపతిరెడ్డి, కార్యదర్శి ఎం.మధుసూదన్, కోశాధికారిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా కిరణ్‌కుమార్, లైబ్రేరియన్‌గా అంబుజామానె, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వై.రంజిత్‌రెడ్డి, ప్రతాప్ లింగం గౌడ్, మహిళా ప్రతినిధిగా రవియాబేగం, కార్యవర్గ సభ్యులుగా రమేష్, డి.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీహెచ్ లక్ష్మీనారాయణ వ్యవహరించారు.



ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికలు



న్యాయవాది, మాజీ కార్పొరేటర్ వనం రమేష్

నల్లకుంట: నాంపల్లి మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు ముగిశాయి. శుక్రవారం జరిగిన ఈ ఎన్నికల్లో నల్లకుంట మాజీ కార్పొరేటర్, ప్రముఖ న్యాయవాది వనం రమేష్ ఓటింగ్‌లో పాల్గొని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కును కలిగి ఉన్న ప్రతి ఒక్క న్యాయవాది నిజాయితీగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.

చెట్ల కొమ్మల తొలగింపు !

చిక్కడపల్లి: డివిజన్‌లోని వీవీగిరినగర్ సమీపంలో భారీ వృక్షం అకస్మాత్తుగా నెలకొరిగింది. చెట్ల కొమ్మలు రోడ్డుపై పడడంతో వాహనాల రాకపోకలకు తరాయం ఏర్పడింది. దీంతో స్థానికులు శుక్రవారం కార్పొరేటర్ ఎ.పావనికి సమాచారం అందించారు. సానుకూలంగా స్పందించిన ఆమె ఈ మేరకు డీఆర్‌ఎస్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు రోడ్డుపై పడిన చెట్ల కొమ్మలను తొలగించారు. ట్రాఫిక్ పోలీసులు కొద్ది సమయం పాటు వాహనాలను దారి మళ్లించి చెట్ల కొమ్మలను తొలగించారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షులు ఎ.వినయ్‌కుమార్, నేతలు అరుణ్‌కుమార్, అభిషేక్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న డీఆర్‌ఎఫ్ బృందం

ఓయూలో విద్యార్థుల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీ అక్రమాలపై శాంతియుతంగా ఆందోళనలు చేపట్టిన కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల అరెస్టును వ్యతిరేకిస్తూ ఓయూ విద్యార్థులు నిరసన తెలిపారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బహుజన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షులు వేల్పుల సంజయ్, ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కేయూ విద్యార్థుల అరెస్ట్ అప్రజాస్వామ్యమని 30 లక్షల నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమడిన టీఎస్‌పీఎస్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.


నీటి వృధాను అరికట్టాలి : డిప్యూటీ మేయర్



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: నీటి వనరుల సంరక్షణ అందరి బాధ్యత అని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఈ నెల 21 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ నీటి దినోత్సవ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా తార్నాకలోని డిప్యూటీ మేయర్ కార్యాలయం వద్ద జలమండలి, స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యతిథిగా పాల్గొని మాట్లాడారు. నీటి వృధాను అరికట్టే పద్ధతులను తెలిపేలా ప్లకార్డులను ప్రదర్శించారు.

ఫిజికల్ డైరెక్టర్‌పదవీ విరమణ



అడ్డగుట్ట: నార్త్‌లాలాగూడలోని రైల్వే బాయ్స్ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన రవికుమార్ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ మేరకు తార్నాకలోని రైల్వే జూనియర్ కాలేజీలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బిజేపీ సీనియర్ నాయకులు మద్దెల శ్యాంసుందర్ పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

లాలాపేట: చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని సికింద్రాబాద్ ప్రాజెక్టు ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఏ. రేణుక అన్నారు. ఈ మేరకు శుక్రవారం లాలాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాల(మార్కెట్ స్కూల్)లో పోషణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరు ధాన్యాలైన సజ్జలు, రాగులు, కొర్రలు, ఆండు కొర్రలు, సామలు, ఊదలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ఈ సందర్భంగా ప్రదర్శించారు.

జైలు నుంచి బీజేవైఎం నాయకుల విడుదల



మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న కుటుంబ సభ్యులు

ముషీరాబాద్: జైలు గోడలకు, లాఠీ, తూటాలకు భయపడేది లేదని నిరుద్యోగ యువత తరపున పోరాటం కొనసాగిస్తామని బీజేవైఎం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మద్దూరి శివాజీ అన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజీపై కార్యాలయం ఎదుట నిరసన చేపట్టినందుకు 11 మందిపై కేసులు నమోదు చేసి 16 రోజులు రిమాండ్‌లో ఉంచారు. శుక్రవారం వారు విడుదలైన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు రాంనగర్ చౌరస్తాలో మద్దూరి శివాజీ, సిటీ ఆఫీస్ కో– ఆర్డినేటర్ ఆయుష్‌రాజ్‌లకు ఘన స్వాగతం పలికారు. అనంతరం హరినగర్‌లోని ఆయన నివాసం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దూరి శివాజీ మాట్లాడుతూ.. తనపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపినా.. తన మనోధైర్యం తగ్గలేదన్నారు. ప్రగతి భవన్ కనుసన్నల్లోనే ప్రశ్న పత్రాల లీకేజీ జరిగిందని ఆరోపించారు. సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ముందు జైలు నుంచి విడుదలైన వారిని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. బీజేపీ సీనియర్ నాయకులు పూస రాజు, భరత్‌గౌడ్, నవీన్‌గౌడ్, అరుణ్‌కుమార్, జైపాల్‌రెడ్డి, వినయ్‌కుమార్, విశ్వం, శక్తి సింగ్, రాజ్‌కుమార్, మహాలక్ష్మి పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయండి !



నల్లకుంట: నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ మెయిన్ రోడ్డులోని మహేష్ పాన్‌షాప్ లైన్‌లో చాలా రోజుల క్రితం సీసీ రోడ్డును నిర్మించారు. ఆ సమయంలో అంతర్గత రోడ్డులో గతంలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు చాలా వరకు తొలగిపొయాయి. స్పీడ్ బ్రేకర్లు లేని కారణంగా ఈ వీధి గుండా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు వేగంగా దూసుకుపోతుంటారు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

- పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు ఎక్కువగా ఈ వీధి గుండానే రాకపోకలు సాగిస్తుంటారన్నారు.
- వేగంగా దూసుకొచ్చే వాహనాలు ఢీకొని పలువురు గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు.
- పిల్లలు, వృద్ధులను బయటకు పంపించాలంటే భయం వేస్తోందని ప్రజలు వాపోతున్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామ పట్టాభిషేకం



వాయిలిన్ వాద్య సమ్మేళనంలో చిన్నారులు



చిక్కడపల్లి: నగరంలో ప్రసిద్ధి గాంచిన చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామ పట్టభిషేకం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. చైర్మన్ గుండెపూడి మురళీ ప్రసాద్, కార్యనిర్వాహణాధికారి మాచర్ల దేవనాధంలు కార్యక్రమాలను పర్యవేక్షించారు. దేవాలయం పునర్నిర్మాణ కమిటీ సభ్యులు డాక్టర్ రామకృష్ణ, జీ.కె.రమణ, మురికిగణేష్, పద్మ బాసాని, అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, కె.కృష్ణమూర్తి, వెంకటాద్రి, పురుషోత్తమాచారి, ఎస్.బి.వీ.ఎన్ ఆచార్యులు తదితరులున్నారు.

ఆకట్టుకున్న వాయిలిన్ సమ్మేళనం..

- వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం సాయంత్రం కళారత్న అశోక్ గుర్జాలే శిష్య బృందంచే నిర్వహించిన వాయిలిన్ వాద్య సమ్మేళనం ఆకట్టుకుంది.